పదేళ్ల సమస్య పరార్

- జేఎన్‌టీయూకేలో చకచకా అభివృద్ధి పనులు
- ప్రారంభమైన రహదారులు, డ్రైనేజీల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న విదార్థులు, అధ్యాపకులు



చురుగ్గా సాగుతున్న సిమెంట్ రోడ్డు పనులు



నీరు నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్న విద్యార్థులు (ఫైల్)

బాలాజీచెరువు: పదేళ్లుగా జేఎన్‌టీయూకేలో వెంటాడుతున్న డ్రైనేజీలు, రహదారుల సమస్యకు త్వరలో మోక్షం కలగనుంది. ఈ సమస్యలపై 'సాక్షి' పలు మార్లు కథనాలు ప్రచురించినా అప్పటి ఉపకులపతులు పట్టించుకోలేదు. వ్యయం భరించలేమని వారు వెనుకంజ వేశారు. కళాశాల నుంచి వర్సిటీ స్థాయిగా ఏదిగినా క్యాంపస్‌లో వర్సిటీ ప్రారంభ దశలో 2017లో వేసిన తారు రోడ్లే తప్ప ఇప్పటి వరకూ కొనసాగుతూ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దాదాపు వంద ఎకరాల విస్తీర్ణం ఉన్న వర్సిటీ ఆవరణలో ఒక పక్క కళాశాల, వసతిగృహాలతో పాటు, మరో పక్క వర్సిటీ పరిపాలన భవనం ఉంది. విద్యార్థులు, సిబ్బందితో పాటు వర్సిటీకి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారితో కలిసి నిత్యం దాదాపు మూడు వేల మంది సంచరిస్తూ ఉంటుంటారు. అటువంటి ప్రాంగణంలో రహదారి వ్యవస్థ లేక నానా అవస్థలు పడేవారు. వర్షాకాలం వస్తే మరీ అధ్వానంగా తయారవుతాయి. వర్సిటీ చుట్టు పక్కల ఉన్న రహదారులు ఎత్తుగా ఉండడంతో నీరు బయటకు పోయే మార్గం లేక వారం రోజుల పాటు నిల్వ ఉండిపోయేవి. వర్సిటీకి నలుగురు వీసీలు మారినా ఈ సమస్యవైపు ఎవరూ చూడలేదు. ఈ ప్రభుత్వంలో నియమితులైన ప్రస్తుత వీసీ పాలక మండలిలో ఆమోదించి తక్షణం పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. దాదాపు రూ.20 కోట్లతో సిమెంట్ రోడ్లతో పాటు డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. తొలుత వసతిగృహాల ప్రాంత నుంచి పనులు ప్రారంభించి రెండు నెలలో పనులు పూర్తిచేసేలా వేగవంతంగా పనులు చేసట్టారు.

జూన్ నాటికి పూర్తి..



పనులు ఆగకుండా ఏప్రిల్, మే నెలలో పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌కు సూచించాం. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం నాటికి ప్రధాన పనులు రోడ్లు, డ్రైన్‌లు పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. మిగతా పనులు స్నాతకోత్సవ భవనం, హాస్టల్స్ భనన నిర్మాణాల పనులు ప్రారంభమయ్యాయి.
– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, వీసీ, జేఎన్‌టీయూకే

క్లుప్తంగా

రాయిపల్లి సేవలు అభినందనీయం



పేదలకు నూతన వస్త్రాలను పంపిణీ చేసిన అడబాల ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: రాయిపల్లి సేవలు అభినందనీయమని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ సామాజిక కార్య దినోత్సవం నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త డాక్టర్ శిరీష మాట్లాడుతూ రాయపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో నిత్యం రోగులకు సాయం చేయడానికి కొందరిని నియమించి అమూల్యమైన సేవలు అందిస్తున్నారని, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు పుస్తకాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారని వివరించారు. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో రాయపాటి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.

నూతన వస్త్రాలు పంపిణీ

అలాగే ట్రస్ట్ కార్యాలయంలో అడబాల దత్త ధీరజ్ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు నూతన వస్త్రాల పంపిణీ చేశారు.

ఘనంగా దొమ్మేటి జయంతి



వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శెట్టిబలిజ జనజాగృతి నాయకులు

కాకినాడ సిటీ: జిల్లా శెట్టిబలిజ జనజాగృతి ఆధ్వర్యంలో గురువారం శెట్టిబలిజ జాతిపిత స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి 170వ జయంతిని ఆ సంఘ నాయకులు నిర్వహించారు. శెట్టిబలిజ సంఘ నాయకులు పితాని నూకరాజు, గెద్దాడ వెంకటేశ్వరరావు, యు.కొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యులు గుబ్బల తులసీకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ 120 ఏళ్ల క్రితం వెంకటరెడ్డి శెట్టిబలిజ అనే నామకరణం చేసి సంఘాన్ని స్థాపించారన్నారు. అనేక సంఘాలకు, కళాశాలలకు సొంతంగా స్థలాలను దానం చేసిన మహోన్నతుడని అని కొనియాడారు. శెట్టిబలిజ సంఘ నాయకులు చిన్ని భావన్నారాయణ, అంగటి అంజిబాబు, పితాని వరప్రసాద్, నక్కా వెంకటేశ్వరరావు, దొడ్డి వీరబాబు, అంగటి గోవింద, కొలుసు మూర్తి, జిత్తుక శ్రీను, నక్కా అప్పారావు, చిన్న ప్రేమ్‌కుమార్, కాశా కుమార్ పాల్గొన్నారు.

వేళంగిలో ఆధార్ సేవలు



ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

కరప: మండలం వేళంగి గ్రామ సచివాలయంలో గురువారం ప్రత్యేక సంచార ఆధార్ కేంద్రాన్ని నిర్వహించారు. డిజిటల్ అసిస్టెంట్ సూరాడ అబ్బాయి సచివాలయ సిబ్బందితో కలసి బయోమెట్రిక్, ఆధార్ మొబైల్ లింక్ అప్‌డేషన్, కొత్తవారికి ఆధార్ నమోదు, 2010–16 సంవత్సరాల మధ్యకాలంలో ఆధార్‌కార్డు తీసుకున్నవారికి ఆధార్ అప్డేషన్ తదితర సేవలు అందించినట్టు సిబ్బంది తెలిపారు. సర్పంచ్ సవిలే నీలిమ, వైఎస్సార్ సీపీ నాయకుడు సవిలే రాజేష్ ఆధార్ అప్డేషన్‌కు ఏర్పాట్లు చేశారు.

జయలక్ష్మి సొసైటీలో ఘనంగా హోమం

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద జయలక్ష్మి సొసైటీ మెయిన్ బ్రాంచ్‌లో డిపోజిటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి, దత్త, చండీ హోమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. హోమాలు, పూర్ణాహుతి, అన్న ప్రసాద వితరణ చేశారు. డిపాజిటర్లకు మంచి జరగాలని నాయకులు వేడుకున్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

కాకినాడ సిటీ: పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సమయంలో ఉచితంగా ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఏప్రిల్ మూడో నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు తమ నివాస స్థలం నుంచి పరీక్ష సెంటర్ వరకు వారి హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు.

బాబా విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

కాకినాడ రూరల్: మండలంలోని గంగనాపల్లిలో సుమారు 151 అడుగుల షిర్డీసాయిబాబా విగ్రహం ఏర్పాటుకు గురువారం శంకుస్థాపన చేశారు. సువర్ణరాజు ఫౌండేషన్, ముమ్మిడి రాజబాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

నేటి నుంచి సరస్వతీగాన సభ వార్షికోత్సవాలు

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు 26 తేదీ వరకు సరస్వతీగాన సభ 119వ వార్షిక సంగీత, నృత్య నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు గాన సభ కార్యదర్శి పి.రామకృష్ణ తెలిపారు. 24వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు సంగీత విద్వాంసులు సిక్కిల్ గురుచరణ్ గాత్ర కచేరి, 25న ఎస్.అంజలి వీణాకచేరి, 26న కర్నూరి హరీష్ హిందూస్థానీ గాత్ర కచేరి నిర్వహిస్తామని తెలిపారు. సంగీత అభిమానులు అందరూ హాజరు కావాలని కోరారు.

250 మందికి మధుమేహ పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కరప: మధుమేహ వ్యాధిపై అవగాహన కల్పించుకుని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కాకినాడ స్టార్స్ లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ సీహెచ్ గణేష్‌ప్రసాద్ అన్నారు. గ్రామశివారు బొందలవారిపేటలో గురువారం గురజనాపల్లి గ్రామస్తుడు, కాకినాడ మైత్రి లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ కర్నాసుల శివకుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. కాకినాడ మెడికవర్ హాస్పటల్ సిబ్బంది, టెక్నిషియన్ జైన్ బృందం 250 మందికి పరీక్షలు నిర్వహించారు. వ్యాధి నిర్ధారణ అయినవారికి ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్టార్స్ లయన్స్‌క్లబ్ సెక్రటరీ లయన్ జి.నమశివాయ, కోశాధికారి ఇందుగుల ప్రసాద్‌నాయుడు, వీఎస్‌ఆర్ మూర్తి పాల్గొన్నారు.

వేళంగిలో అమరవీరుల దినోత్సవం



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు, యువకులు

కరప: మండలం వేళంగి పీహెచ్‌సీ ఆవరణలో గురువారం భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని సీఐటీయూ, వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ సంయుక్తంగా అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎం.క్రాంతిసింధూర, సీఐటీయూ మండల కార్యదర్శి ఆర్.వెంకటలక్ష్మి, గ్రాడ్యుయేట్ యూత్ ప్రతినిధులు ఎర్రా విక్రమ్, అప్పికొండ దుర్గాప్రసాద్, సీహెచ్ అప్పన్న, షేక్ లాలిబాబు, ఎం.జనార్దన్, కె.మురళి, అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, శారద, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

కాకినాడ సిటీ: భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా అఖిల భారత కార్మిక సంఘాల సమ్మెకు మద్దతుగా ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా కౌన్సిల్ సమావేశం స్థానిక గాంధీ భవన్‌లో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కరీంబాషా పాల్గొని మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మోదీ షా కాలంలో కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. ప్రైవేటీకరణ దిశగా అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగిస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఆర్.సతీష్, నాయకులు శివాజీ, టి.శ్రీను, ఏసుబాబు, మూర్తి, అత్తిలి బాల సూర్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు
- కరప పోలీసు స్టేషన్‌లో రికార్డుల తనిఖీ



కరప పోలీసుస్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కరప: మహిళల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసుశాఖ పనిచేస్తున్నట్టు ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను గురువారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. కోవిడ్ తర్వాత సంప్రదాయబద్ధంగా పండగలు చేసుకుంటున్నారని, ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. పరివర్తన ద్వారా రెండేళ్లుగా గంజాయిసాగు తగ్గించామన్నారు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డ ముద్దాయిలపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసి, శిక్షపడేలా చేస్తున్నామన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులపై గట్టి నిఘా ఏర్పాటుచేసినట్టు తెలిపారు. దిశ యాప్ ద్వారా క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుని, బాధితులను ఇంటివద్ద దిగబెడుతున్నామన్నారు. పెదపూడి మండలం కాండ్రేగుల వద్ద మహిళపై హత్య జరిగిన 138 రోజుల్లోనే నిందితునికి యావజ్జీవ కారాగారశిక్ష పడేలా చేశామన్నారు. ఏలేశ్వరంలో బాలికపై అత్యాచారం జరిగితే ముద్దాయికి ఏడేళ్లు, పెద్దాపురం కేసులో పదేళ్ల కారాగార శిక్ష పడిందని ఎస్పీ వివరించారు. ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకుని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఉమెన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, స్టేషన్‌కు వచ్చే మహిళల సమస్యలు అడిగి తెలుసుకునేందుకు మహిళాపోలీసును, హోమ్‌గార్డును నియమించామని అన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ, ఫ్రెండ్లీ పోలీసుగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ముందుగా కరప పోలీసుస్టేషన్ రికార్డులను తనిఖీచేసి, స్టేషన్ నిర్వహణ, ఎన్ని కేసులు నమోదయ్యాయి, ఎన్నింటిని పరిష్కరించిందీ తెలుసుకున్నారు. ఎస్సై నౌడు రామకృష్ణ, ఏఎస్సై జి.ప్రసన్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారంపూడి హయాంలోనే అభివృద్ధి

- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర
- కొండబాబు ప్రచార ఆర్భాటంపై ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న, చిత్రంలో కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి తదితరులు

కాకినాడ: ప్రచార ఆర్భాటం కోసం టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారంన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ త్వరలో జరిగే స్మార్ట్ సిటీ బోర్డు సమావేశంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)పై నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో కొండబాబు మరోసారి తన నైజాన్ని బయటపెట్టుకున్నారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా రూ. 19 కోట్లు బకాయిలంటూ కల్లబొల్లి కబర్లతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే ద్వారంపూడి ఏదైనా ఓ నిర్ణయం తీసుకుని అమలులోకి తెచ్చే ముందు కొండబాబు బయటకు వచ్చి హడావుడి చేసి అదంతా తనవల్లే జరిగిందనే మెప్పు పొందేందుకు షో చేయడం పరిపాటిగా మారిందన్నారు. గతంలో జగన్నాథపురం వంతెన శంకుస్థాపనకు ముందు ఆందోళన చేయడం, మెయిన్‌రోడ్డులో ఓ మద్యం షాపును తొలగింపుపై ఆందోళన చేయడాన్ని చూస్తే కొండబాబు నైజం బయటపడుతుందన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన విషయం ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. కాగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సంబంధించి రూ.4 కోట్ల బకాయిని రూ.19 కోట్లుగా చెప్పడం కొండబాబు అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. సమావేశంలో కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్రికెటర్ల స్కాలర్‌షిప్‌కు 26న ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్: జిల్లాలో ప్రతిభ గల మహిళా క్రికెటర్లకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హిందూస్థాన్ యూనిలీవర్ సౌజన్యంతో అందించే స్కాలర్‌షిప్‌లకు ఈనెల 26న ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి సత్యనారాయణ గురువారం తెలిపారు. స్థానిక రంగరాయ వైద్య కళాశాల క్రీడాప్రాంగణంలో ఉదయం 8 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గల వారు ఈ ఎంపిలకు హాజరుకావాలని, వివరాలకు 98852 76888 నెంబరులో సంప్రదించాలని కోరారు.

శ్రీరామచంద్రమూర్తి మృతి బాధాకరం

బోట్‌క్లబ్: డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకాశం శ్రీరామచంద్రమూర్తి మృతి బాధాకరమని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు అభివృద్ధికి ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో డీసీసీబీ పాలకవర్గ సభ్యులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సాయి జ్ఞానయజ్ఞం వితరణ

కాకినాడ సిటీ: కాకినాడ ముత్తానగర్‌కు చెందిన శ్రీనివాసరావు అనే దివ్యాంగుడికి సాయి జ్ఞానయజ్ఞం ట్రస్ట్ చైర్మన్ తిరుపతిరావు ఒక నెల ఇంటి అద్దె, నిత్యావసరవస్తువులు, నూతన వస్త్రాలను గురువారం అందించారు. తమ సంస్థ దివ్యాంగులకు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న సభ్యులకు సాయం చేస్తూ ప్రజా సేవలో తరిస్తోందన్నారు. తలుపుల మధు, వీవీఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బద్దిగడుగు ఉత్సవం

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి బద్దిగడుగు ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఉగాది రోజున అమ్మవారి ఆలయ తలుపులు మూసివేసి మరుసటి రోజున ఆలయ తలుపులు తెరచి బద్ది ఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. భాజాభజింత్రీలతో ఏలేరు నదికి వెళ్లి బద్దిని కడిగి తీసుకువచ్చి అమ్మవారి ఆలయంలో ఉంచుతారు. గరగను పూజించి అమ్మవారికి దీప, ధూప నేవేద్యాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆలయ ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణ, ఆలయ ఆసాదులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శిశు అభివృద్ధి సేవా పథకం పీఓ ఎ.విజయలక్ష్మి సోమవారం తెలిపారు. దుమ్ములపేట–1, ఫ్రేజర్‌పేట–1, బ్యాంక్‌పేట–3, రెల్లిపేట, ముగ్గపేట, విముక్తికాలనీ, గొడారిగుంట–5 ప్రాంతాల్లోని పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.

అభ్యర్థులు పదో తరగతి పాస్ అయి ఉండాలని, దరఖాస్తు చేసే అభ్యర్థినులు 2022 జూలై 1 నాటికి 21 ఏళ్లు నిండి 35 ఏళ్ల లోపు ఉండి స్థానికులు ఉండాలన్నారు. దరఖాస్తులను ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం నుంచి పొంది, తిరిగి అదే కార్యాలయంలో ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందజేసి రసీదు పొందాలన్నారు. దరఖాస్తులను సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టు, డైరీ ఫారమ్, కరెంట్ ఆఫీస్ వెనుక, అన్నా క్యాంటీన్ వీధి, రాజీవ్ గృహకల్ప వద్ద అందజేయాలన్నారు.

కాకినాడ రూరల్ పరిధిలో..:

సామర్లకోట రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జీవీ రమణ తెలిపారు. ఒక కార్యకర్త పోస్టు, తొమ్మిది సహాయక పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. రూరల్ మండలం ఇంద్రపాలెం విఘ్నేశ్వరనగర్ కోడ్ నంబర్ 209 అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త పోస్టుకు, సామర్లకోట రూరల్ మండలంలోని నవర, కొత్త కాలనీ, చంద్రపాలెం ఎస్సీ ఏరియా–1, కాకినాడ రూరల్ ఇంద్రపాలెం, కామరాజు వీధి, తారక రామ కాలనీ, తిమ్మాపురం ఓసీ కాలనీ, రేపూరు–1, పెదపూడి మండలం జి.మామిడాడ మధ్య పేట, పెదపూడి రామాలయం వీధి–1, పెదపూడి చాకలిపేట (బీసీ)–2 తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమగ్ర శిశు అభివృద్ధి పథక అధికారిణి, సామర్లకోట రూరల్ కార్యాలయంలో అందజేయాలని సీడీపీవో రమణ వివరించారు.

తాళ్లరేవు ఐసీడీఎస్ పరిధిలో..

కరప: తాళ్లరేవు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కరప మండలంలో వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసినట్టు సీడీపీఓ వి.మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకొత్తూరులో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), కరప–7లో అంగన్‌వాడీ సహాయకురాలు (బీసీ–ఎ), కూరాడ–1లో సహాయకురాలు (బీసీ–ఇ), కరప–8లో సహాయకురాలు(బీసీ–సి), పెద్దాపురప్పాడు–1లో సహాయకురాలు(ఓసీ) క్యాటగిరీలకు రిజర్వ్ చేయబడ్డాయన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, మినీ అంగన్‌వాడీ వర్కర్ల పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక వివాహిత మహిళలు అర్హులన్నారు. 2022 జూలై ఒకటో తేదీ నాటికి వయస్సు 21 ఏళ్లు నిండి 35 ఏళ్లలోపు ఉండాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువీకరణపత్రాలు తీసుకుని దరఖాస్తు చేయాలని, సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపికచేస్తారని సీడీపీఓ తెలిపారు. తాళ్లరేవు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకుని, పూర్తిచేసిన దరఖాస్తులు అదే కార్యాలయంలో అందజేయాలని గ్రేడ్–1 విస్తరణాధికారి పి.కనకరత్నం తెలిపారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



ఆపదమిత్రలకు శిక్షణ ఇస్తున్న శివకుమార్

సామర్లకోట: ప్రమాదాలను గుర్తించిన వెంటనే ఆపద మిత్రలు అప్రమత్తమైతే పెను ప్రమాదాలను నివారించవచ్చని రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు అధికారి డి.శివకుమార్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాల ఆపద మిత్రల శిక్షణలో భాగంగా గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రమాదాలను గుర్తించడం, క్షతగాత్రులను రక్షించడంపై ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రకృతి విపత్తులపై అధికారుల ప్రకటనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే జంతువులను గు ర్తించిన సమయంలో అటవీ శాఖ అధికారులకు సమా చారం ఇవ్వాలని అటవిశాఖ స్టేషన్ అధికారి వెంకటేశ్వరరావు (రాజమహేంద్రవరం) సూచించారు. ఈ శిక్షణలో ఫ్యాకల్టీలు శ్రీదేవి, డి.దినేష్, ఎం.శ్రీనివాసరా వు, జీవీ రమణ, కేఎస్ కొండలరావు శిక్షణ ఇచ్చారు.

మొక్కవోని నిర్లక్ష్యం

- శిథిలమవుతున్న వంతెన గోడలు
- కాను నుంచి బయటకు వచ్చిన ఊచలు
- పెరుగుతున్న లోడ్ వాహనాల రాకపోకలు



సత్యనారాయణపురం కానులో బయటకు వచ్చిన ఇనుప ఊచలు



బ్రిడ్జి గోడలో పెరిగిన మొక్కలు

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో బ్రిడ్జి శిథిలావస్థకు చేరుతోంది. 1973 మే 28న అప్పటి సీఎం జలగం వెంగళరావు ఈ బ్రిడ్జిని ప్రారంభించి ప్రజలకు రైల్వే గేటు కష్టాలను తీర్చారు.

ఈ బ్రిడ్జితో సామర్లకోట నుంచి కాకినాడ, కెనాల్ రోడ్డులో రాజమహేంద్రవరం వెళ్లడానికి మార్గం సుగమమైంది. మరో వైపు ఏడీబీ రోడ్డు పనులలో భాగంగా రాజానగరం నుంచి కాకినాడ పోర్టుకు ఈ ఫ్లై ఓవర్‌ను కలుపుతూ పెద్దాపురం ఏడీబీ రోడ్డు నిర్మించారు. దాంతో సామర్లకోట నుంచి రాజానగరం మీదుగా రాజమహేంద్రవరం వెళ్లడానికి రహదారి ఏర్పడింది. ఇంత ప్రాధాన్యమున్న ఈ ఫ్లైఓవర్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల శిథిలావస్థకు చేరే పరిస్థితి ఏర్పడుతోంది. సత్యనారాయణపురానికి వెళ్లే మార్గంలో బ్రిడ్జి గోడ పెచ్చులు ఊడడం, రైల్వే కార్టర్ల కాను గోడ బీటలు వేయడంతో ఇనుప ఊచలు బయటకు కనపడుతున్నాయి. ఆ బీటలకు మరమ్మతులు చేయకుంటే ఆకతాయిలు ఆ ఊచలను కోసి తీసుకుపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోడల బీటల నుంచి మొక్కలు..

ఫ్లైఓవర్‌కు బీటలు పడిన చోట మొక్కలు పెరిగి వృక్షాలుగా పెరిగిపోతున్నాయి. అలాగే ఈ వంతెనపై నుంచి సుమారు 60 నుంచి 80 టన్నుల బరువైన లోడుతో వాహనాలు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తుండడంతో 50 ఏళ్ల క్రితం నాటి నిర్మాణం దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వంతెన దెబ్బతింటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురి కావలసి వస్తుంది.

ఇంటర్ చదువుతున్న సమయంలో ప్రారంభించారు



స్థానిక షుగర్ ఫ్యాక్టరీ గేటు వద్ద ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడుతుండడంతో ఈ వంతెన నిర్మించారు. అప్పుడు నేను ఇంటర్ చదువుతున్న రోజులు. వంతెన దెబ్బతిన్న చోట రంగులు వేసి సరిపెడుతున్నారు తప్ప పూర్తి స్థాయి మరమ్మతులు చేయడం లేదు. ఇప్పటి నుంచే మరో వంతెన నిర్మాణానికి దృష్టిపెట్టాలి.
– పోతుల వీర్రాజు, రోటరీ క్లబ్ సభ్యుడు, సామర్లకోట

ఆర్అండ్‌బీ అధికారులకు వివరిస్తాం..



ఫ్లైఓవర్ నిర్వాహణ ఆర్అండ్‌బీ అధికారులు చేయాల్సి ఉంది. వంతెన సమస్యలను ఆర్అండ్‌బీ, రైల్వే అధికారుల దృష్టికి తీసుకు వెళతాం. ఫ్లైఓవర్‌పై తరుచూ పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నాం.
– నయీం అహ్మద్, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

నాణ్యమైన శిక్షణ అందించాలి

జెడ్పీ సీఈఓ సత్యనారాయణ



ఉండూరులో స్వచ్ఛ సంకల్పంపై మాట్లాడుతున్న సీఈఓ సత్యనారాయణ

సామర్లకోట: స్వచ్ఛ సంకల్పంపై వివిధ మండలాల నుంచి వచ్చే సిబ్బందికి నాణ్యతతో కూడిన శిక్షణ ఇవ్వాలని జెడ్పీ సీఈఓ ఎస్.సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలో ఉండూరు గ్రామంలో జగనన్న స్వచ్ఛ సంకల్పంపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణకు జిల్లా నుంచి ఉండూరు యూనిట్‌ను ఎంపిక చేశామని, ఇక్కడ పొందిన శిక్షణను మోడల్ గ్రామాలుగా ఎంపికైన స్థానిక అధికారులకు వివరించాలని తెలిపారు. సామర్లకోట మండలం నుంచి అచ్చంపేట, పనసపాడు, గొల్లప్రోలు మండలం నుంచి ఏపీ మల్లవరం, చేబ్రోలు, పిఠాపురం మండలం నుంచి ఎఫ్‌కే పాలెం, చిత్రాడ, తొండంగి మండలం నుంచి తొండంగి, ఏవీ నగరం, ప్రత్తిపాడు మండలం నుంచి ధర్మవరం, ఉత్తరకంచి, జగ్గంపేట మండలంలో గోవిందపురం, రాజపూడి, కిర్లంపూడి మండలం నుంచి బూరుగపూడి, సోమరాయనిపేట, తామరాడ, సోమవరం, సుంగరాయనిపాలెం, సింహాద్రిపురం, రాజుపాలెం, పాలెం, ముక్కోలు, కృష్ణవరం, జగపతినగరం, గోనేడ, గెదనాపల్లి, రామకృష్ణపురం, వీరవరం, భూపాలపట్నం, ఎస్. తిమ్మాపురం, వేలంక, రామచంద్రపురం గ్రామాల్లోని పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, అగ్రికల్చర్ అసిసెంట్, ఇంజినీరింగ్ అసిసెంట్లకు శిక్షణ ఇవ్వాల్సి ఉందని వివరించారు. అన్ని గ్రామాలు శుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో ఈ నెల 31 నుంచి జగనన్న స్వచ్ఛ సంకల్పం ప్రారంభమవుతుందన్నారు. ప్రతి గ్రామంలోను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు కావాలని పిలుపునిచ్చారు. డీపీఓ విక్టర్, ఎంపీడీఓ డి.శ్రీలలిత, పంచాయతీ కార్యదర్శి కుమార్‌రాజా, పంచాయతీ సర్పంచ్ పంతాడి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వర్మీ కంపోస్టు యూనిట్‌ను సీఈఓ, డీపీఓలు పరిశీలించారు.